‘రైతుబీమా’ మార్గదర్శకాలు విడుదల

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, జూలై 19 : ప్రభుత్వం రైతుబీమా పథకం-2024 సంవత్సరానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసిందని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. పథకం 7వ పాలసీ విధివిధానాలు ఖరారైన నేపథ్యంలో నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పొందిన రైతులు రైతుబీమా పథకానికి పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 28-06-24లోపు ధరణి పోర్టల్ ద్వారా ధ్రువీకరించి పొందిన పట్టాదారులు, 18-59 ఏళ్ల వయస్సు కలిగిన వారు మాత్రమే పథకానికి అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో బీమా పథకానికి 2,25,364 మందికి బీమా రెన్యువల్ చేస్తామని, వీరితోపాటు మరో 15,075 మంది కొత్త రైతులకు అవకాశం ఉందని తెలిపారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా రైతువేదికలోని గ్రామ వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలని, పూర్తి వివరాలకు ఏఈవోలను సంప్రదించాలని ఆమె సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్‌రావు**

ఖమ్మం, జూలై 20 : వాతావరణ శాఖ రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ప్రకటించిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లొద్దని నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు శనివారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. చెరువులు, భారీ నీటి ప్రాజెక్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని డీఈలు, ఏఈలు, లష్కర్‌లను సీఈ ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ సీఈ ధన్‌కుమార్‌రెడ్డి, కల్లూరు ఎస్ఈ ఎం.ఆనంద్‌కుమార్, ఖమ్మం ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, సత్తుపల్లి ఈఈ శ్రీనివాసరెడ్డి, పెనుబల్లి డీఈ, ఏఈలు ఉన్నారు.

నేడు పాలేరుకు సాగర్ జలాలు

- **తాగునీటి అవసరాలకు వినియోగించాలన్న అధికారులు**

డెడ్ స్టోరేజీలో పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, జూలై 20 : నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి శుక్రవారం విడుదల చేసిన జలాలు ఆదివారం పాలేరు రిజర్వాయర్‌కు చేరుకోనున్నాయి. ఐదు జిల్లాలకు తాగునీరు అందించే పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా పడిపోయి 5.4 అడుగుల అట్టడుగు స్థాయికి చేరింది. దీంతో తాగునీటి అవసరాల కోసం సాగర్ నీటిని విడుదల చేయాలని అధికారులు కేఆర్ఎంబీకి లేఖ రాయడంతో నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా రిజర్వాయర్ నుంచి ఖమ్మం, సూర్యాపేట, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. సాగర్ నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండగా.. ఆదివారం వరకు 135 కిమీ దూరం ప్రవహించి నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ వద్ద పాలేరులో కలువనున్నది. నాలుగు రోజులపాటు పాలేరు కోసం సాగర్ నుంచి నీటిని వదలనున్నారు. సుమారు ఒక టీఎంసీ నుంచి 1.25 టీఎంసీల వరకు నీరు చేరే అవకాశం ఉంది. పాలేరుకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తోడైతే తప్ప రిజర్వాయర్ నిండే పరిస్థితి లేదు. సాగర్‌లో నీరు నాలుగు రోజులకు బంద్ అయినా మరో వారం రోజులపాటు పాలేరుకు నీరు వచ్చే అవకాశం ఉంది. పాలేరు నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలరని ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు కోరారు.

గోదావరికి వరద పోటు

35.70 అడుగుల వద్ద నీటిమట్టం

భద్రాచలం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం, జూలై 20: ఎగువన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. శనివారం రాత్రి 9 గంటలకు 35.70 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. రాత్రి వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు 27.8 అడుగులు ఉన్న గోదావరి ఉదయం 8 గంటలకు 31.3 అడుగులకు చేరింది. మధ్యాహ్నం 12 గంటలకు 33.8 అడుగులు, సాయంత్రం 4 గంటలకు 34.9 అడుగులు, 6 గంటలకు 35.2 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. ముంపు ప్రాంత ప్రజల కోసం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ఉధృతి మరింత పెరిగితే పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. సెలవులో ఉన్న అధికారులు వెంటనే సెలవులు రద్దు చేసుకొని విధుల్లో చేరాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆర్డీవో దామోదర్‌రావు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా కోర్టులో సోలార్ పవర్ ఎనర్జీ

సోలార్ పవర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్

కొత్తగూడెం టౌన్, జూలై 20: జిల్లా కోర్టుల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ఎనర్జీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ భానుమతి, న్యాయమూర్తులు సాయిశ్రీ, శివ నాయక్, బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, జిల్లా న్యాయశాఖ అధ్యక్షుడు రామిశెట్టి రమేష్, లగడపాటి సురేష్ పాల్గొన్నారు.

ఐటీడీఏలో కంట్రోల్ రూం

భద్రాచలం, జూలై 20 : భద్రాచలం వద్ద గోదావరి వరద అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పీవో బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. వరద ముంపునకు గురయ్యే ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వరద సమాచారంతోపాటు పునరావాస కేంద్రాలు, తమ సమస్యల గురించి ఐటీడీఏ కార్యాలయంలో 7995268352, సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743-232444, 7981219425 నెంబర్లకు ఫోన్ చేసి చెప్పడంతోపాటు సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ఆయా నెంబర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

కొత్తగూడెం క్రైం, జూలై 20: మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్మా జిల్లా జగర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమార్‌గట్టా-సింగవరం అడవుల్లోని గుట్టల మధ్య డీఆర్‌జీ దళాలు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈక్రమంలో మావోయిస్టులు తారసపడి వారిపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య సుమారు 25 నిమిషాలపాటు భీకరపోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోవడంతో ఆ ప్రాంతాన్ని జవాన్లు తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టు మృతదేహంతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో అదనపు భద్రతా దళాలు మోహరించి గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

తాలిపేరుకు వరద ఉధృతి
25గేట్లు ఎత్తివేత

- **1,45,078క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల**

చర్ల, జూలై 20: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నదులు, వాగులు పొంగుతున్నాయి. తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద రావడంతో అధికారులు 25 గేట్లను పూర్తిగా ఎత్తి 145078క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. లింగాపురంపాడు వద్ద ఈతవాగును వరదనీరు చుట్టుముట్టడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తేగడవద్ద ఉన్న లోలెవల్ చప్టా నీట మునిగింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వానకు పూజారిగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సుమారు రెండు అడుగుల నీరు చేరింది.

పెదవాగు గండ్లపై స్పందించిన సర్కారు

- **క్రస్ట్ గేట్ల పనితీరుపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ సమీక్ష**
- **నేడు పెదవాగు ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రి తుమ్మల**

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలోని పెదవాగు ప్రాజెక్టు వ్యవహారం నీటిపారుదల శాఖను ఒక కుదుపు కుదిపేసింది. గేట్లు తెరిచే విషయంలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టం కావడం.. భారీ నష్టం వాటిల్లడంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది. వరద ఉధృతి పెరుగుతున్నా అధికారులు అప్రమత్తం కాకపోవడంతో గండ్లుపడి తీవ్ర నష్టం వాటిల్లింది. దీనిపై రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల సామర్థ్యం, క్రస్ట్ గేట్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నుంచి నీరు దిగువకు వదిలేటప్పుడు దిగువ ప్రాంతాలను పరిశీలించడంతోపాటు వరదలపై గంటకోసారి సమీక్ష చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నిర్వహణ గురించి సమీక్ష చేయడంతోపాటు గండ్ల వల్ల జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.

నేడు మంత్రి తుమ్మల సందర్శన

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పెదవాగు ప్రాజెక్టును పరిశీలించనున్నారు. ప్రాజెక్టుకు గండ్లు పడిన తీరు, రైతులు నష్టపోయిన పంట పొలాలను సందర్శించనున్నారు. ఇప్పటికే అధికారులు రెండు రోజులుగా అక్కడే ఉండి ఆ ప్రాంతవాసులకు సహాయక చర్యలు చేపట్టారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ధరణి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

ధరణి హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, జూలై 20 : రైతులు ధరణి సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధరణి సహాయ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఫిర్యాదు పుస్తకాన్ని పరిశీలించారు. ప్రతి వారం భూ వివాదాలు, ధరణి సంబంధిత సమస్యలపైనే బాధితులు వస్తుండడంతో వాటి పరిష్కారంపై దృష్టి సారించి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. రైతులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సహాయ కేంద్రంలో సిబ్బంది సమాచారం అందిస్తారని తెలిపారు. అప్లికేషన్ రిజెక్ట్ కాకుండా రైతులు ప్రతి చిన్న పనికీ పదేపదే అధికారుల చుట్టూ తిరగకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా రైతులు సరైన నమూనాలో దరఖాస్తు చేసుకోకపోవడం, అందుకు సరైన ఆధారాలు చూపించకపోవడంతో అధికారులు పరిశీలన సమయంలో వాటిని తిరస్కరిస్తున్నారని, దీంతో రైతులు తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నట్లు చెప్పారు. దరఖాస్తులకు సంబంధించి స్థితిగతులను కేంద్రంలో తెలుసుకోవచ్చన్నారు. రిజెక్టు అయితే అందుకు గల కారణాలను సిబ్బంది తెలియజేస్తారని కలెక్టర్ వివరించారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటికి రావొద్దని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ఏదేని అత్యవసర సేవలకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08744-241950 నెంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ నంబర్ 9392919743కు మెసేజ్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

కిన్నెరసాని నుంచి 12 వేల క్యూసెక్కులు విడుదల



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచ రూరల్, జూలై 20: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని శనివారం రాత్రి డ్యామ్‌సైట్ అధికారులు విడుదల చేశారు. కిన్నెరసాని ఎగువ ప్రాంతాల్లో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద ప్రాజెక్టులోకి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా, శనివారం ఇన్‌ఫ్లో 5500 క్యూసెక్కులు ఉండడంతో రాత్రికి 402.8 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లోఎక్కువగా ఉండడంతో ప్రాజెక్టు అధికారులు మూడు గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

పెదవాగు ఘటనపై అధికారులకు మెమోలు

అశ్వారావుపేట రూరల్, జూలై 20 : పెదవాగు ప్రాజెక్టు వరద నీటిని అంచనా వేయడంలో విఫలమైన ముగ్గురు ఇరిగేషన్ అధికారులకు శనివారం మెమోలు జారీ చేశారు. ప్రాజెక్టుకు గండిపడి భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో శుక్రవారం ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు మూడో గేటు మొరాయింపు, నీటిని దిగువకు విడుదల చేయకపోవడం తదితర కారణాలతో ఐబీ ఈఈ సురేశ్‌కుమార్, డీఈఈ కృష్ణ, ఏఈ కేఎన్‌బీ కృష్ణలకు నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి మెమోలు జారీ చేశారు.

వాణిజ్య



అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్‌పర్గాలు

టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సందర్శించడంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

పీఎస్‌యూలకు ముప్పతప్పినట్టేనా?

ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యులు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..

1. హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెసీఎల్)	-	324.87
2. హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్	-	126.32
3. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్)	-	551.03
4. హెచ్ఎంటీ వాచెస్	-	888.05
5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ)	-	2,272.85
6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ	-	3,020
	మొత్తం -	7,183.12 ఎకరాలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాకపోవడం, మరోవైపు ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణకు ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణకు మొగ్గుచూపకుండా..కేవలం వాటాని పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇటీవల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నది. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

మూతపడిన 10 సంస్థలు..

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలంటే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలుపాల్సి వుంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలుపాలని రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.

హెచ్ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలే ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఆ తర్వాత క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరారు. దీనిపై కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ఎల్ఐసీ దూకుడు

74 శాతం రిటర్నును పంచిన సంస్థ

న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ మళ్లీ తన పూర్వవైభావాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన మొదట్లో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీదే కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్చేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.

గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..

కంపెనీ	19 జూలై 19 2023 నాటికి	నాటికి జూలై 2024	తేడా (శాతంలో)
ఎల్ఐసీ	620.4	1,080.1	74.10
భారతీ ఎయిర్‌టెల్	869.8	1463	68.20
ఎస్బీఐ	601.35	887.85	47.64
ఐసీఐసీఐ బ్యాంక్	973.65	1248.15	28.19
టీసీఎస్	3,471	4,330.25	24.76
ఇన్ఫోసిస్	1,474.35	1,807.7	22.61
రిలయన్స్	2,840	3,138.35	10.51
హెచ్‌యూఎల్	2,671.75	2,725	1.99
ఐటీసీ	478.85	475.05	-0.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,684.85	1,613.9	-4.21

‘బిల్డర్లకు రాయితీలివ్వండి’

వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

బడ్జెట్ (2024-25)

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరతో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్టీ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడెక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతున్నట్లు చెప్పారు.

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం

ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాం